క్లుప్తంగా

అంగరలో మధ్యాహ్నపు అమ్మవారి సంబరం



గోదావరి నదిలో అమ్మవారిని స్నాన ఘట్టానికి తీసుకువెళుతున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని మధ్యాహ్నపు అమ్మవారి సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కమ్మ సామాజిక వర్గీయులు అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఏటా మాఘ మాసంలో అమ్మవారిని పుణ్య గౌతమీ గోదావరి నదిలో స్నానం చేయిస్తారు. అంగర నుంచి కపిలేశ్వరపురం గోదావరి నది వరకూ అమ్మవారిని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి తీసుకొచ్చారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల వీధుల్లో ఊరేగింపుతో సందడి నెలకొంది. ఆలయం వద్ద గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సంబరం చేశారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన ఆడ పడుచులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కపిలేశ్వరపురం: అంగరలోని అలమేలు మంగా, గోదాదేవి సమేత వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న దశమ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శ్రీనివాస పవన్‌కుమార్, కుంచపూడి బాల బాలాజీ ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన దాసర పట్టాభిరామస్వామి, హిమబిందు దంపతుల చేతుల మీదుగా స్వామి కల్యాణం చేయించారు. కొట్నాల ఉత్సవం, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, కదంబ ప్రసాద వినియోగం, ద్వాదశ ప్రసాద నివేదన, పుష్పోత్సవాలను నిర్వహించారు. ఉత్సవ నిర్వహణకు సహకరించిన భక్తులకు నిర్వాహక కమిటీ చైర్మన్ దాసర లక్ష్మణమూర్తి, కార్యదర్శి పెద్దింశెట్టి రామస్వామి, వైస్ చైర్మన్ సూరంపూడి వెంకట్రావు, సహాయ కార్యదర్శి మోటిపల్లి సత్యనారాయణమూర్తి, కోశాధికారి వాసా కోటేశ్వరరావు, సహాయ కోశాధికారి వెల్ల శ్రీనివాస్, ఔత్సాహికులు సంకాబత్తుల స్వామికాపు కృతజ్ఞతలు తెలిపారు.

భూ ఆధార్ నమోదు తప్పనిసరి



కాజులూరులో భూ ఆధార్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి అశోక్

కాజులూరు: వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ ఆధార్, ఫార్మర్ రిజిస్ట్రీని ప్రతి రైతు తప్పకుండా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి అశోక్ అన్నారు. ఆదివారం కాజులూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓ అశోక్ భూ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర పథకాల ద్వారా రాయితీలు అందాలంటే ప్రతి రైతు భూ ఆధార్‌ను తప్పకుండా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 28వ తేదీ వరకూ అన్ని రైతు సేవా కేంద్రాలలో సిబ్బంది భూ ఆధార్‌ను నిర్వహిస్తారన్నారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబర్ లింకు అయిన మొబైల్ ఫోన్‌తో వచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకుంటాం

రామచంద్రపురం: ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్టు సూర్ల నూకరాజు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జర్నలిస్టు నూకరాజు కుటుంబాన్ని మంత్రి పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నూకరాజు కుటుంబానికి జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.1 లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. రాజు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మాగాపు అమ్మిరాజు, జర్నలిస్టు సంఘ సభ్యులు సుధీర్, ఏసుబాబు, హరినాథ్, రవిచంద్ర, ప్రభాకర్, బోడపాటి ప్రసాద్, భవాని తదితరులు రాజు కుటుంబాన్ని పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే అమ్మిరెడ్డికి ఘన నివాళి

బిక్కవోలు: కొమరిపాలెంలోని మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి 81వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఆదివారం ముందుగా సర్పంచి వాసంశెట్టి రవికుమార్, మాజీ జెడ్పీటీసీ పడాల వీరభద్ర వెంకటరామారెడ్డి తదితరులు అమ్మిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోని మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి అమ్మిరెడ్డి, శెట్టి బలిజ సంఘం మండల కార్యదర్శి వాసంశెట్టి మధుకుమార్, మల్లిడి తిరపారెడ్డి పాల్గొన్నారు.

సుభాష్‌తాలు ఏమయ్యాయి..!

- వీధి లైట్ల స్తంభాలకు దర్జాగా ఫ్లెక్సీల ఏర్పాటు
- ప్రమాదాల రీత్యా వీటిని తొలగించాలని గతంలో మంత్రి ఆదేశం
- తాజాగా దర్శనమిస్తున్న సత్యం వాసంశెట్టి ట్రస్ట్ ఫ్లెక్సీలు
- ట్రస్టు చైర్మన్‌గా కొనసాగుతున్న మంత్రి తండ్రి సత్యం
- నిబంధనలకు తూట్లు పొడవడంపై వెల్లువెత్తుతున్న విమర్శలు



వీధిలైట్ల స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



ఫ్లెక్సీల కారణంగా రాత్రి వేళలో రహదారిపై తగ్గిన లైటింగ్

రామచంద్రపురం: 'వీధిలైట్ల స్తంభాలకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం వలనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వెంటనే ఫ్లెక్సీలను తొలగించండి' స్వయాన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గతంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాలతో హుటాహుటిన మున్సిపాలిటీ అధికారులు రంగంలోకి దిగి ప్రధాన రహదారిలోని వీధిలైట్ల స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పీకి పడేశారు. కానీ ఇప్పుడు మంత్రిగారి కుటుంబం దగ్గరకు వచ్చేసరికి అదే రూల్ ఎందుకు వర్తించటం లేదంటూ పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు. మంత్రి తండ్రి సత్యం చైర్మన్‌గా ఉన్న ఫౌండేషన్‌కు చెందిన ఫ్లెక్సీలు వీధిలైట్ల స్తంభాలపై దర్శనమివ్వడంతో పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. గతంలో మంత్రి ఆదేశాలతో ఫ్లెక్సీలు పీకేసిన తరువాత విద్యుత్ లైట్ల స్తంభాలు ఎల్ఈడీ లైట్లతో సుందరంగా ఉన్నాయి. అందరికీ మార్గదర్శకంగా ఉండాలని తపించే మంత్రి వర్యుల ఆదేశాలు ఏమయ్యాయని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలో ప్రధాన రహదారి నిర్మాణం సమయంలో మధ్యలో వీధి దీపాల స్తంభాలను ఏర్పాటు చేశారు. స్థానిక వీఎస్ఎం కళాశాల నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు, అక్కడి నుంచి కాకినాడ రోడ్డులోని ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు గల స్తంభాలకు వీధి దీపాలు అమర్చి అందంగా తీర్చిదిద్దారు. అయితే పట్టణంలో ఏ కార్యక్రమం జరిగినా, పుట్టిన రోజు వేడుకలైనా, ఫంక్షన్ లేదా ప్రైవేటు సంస్థల కార్యక్రమాలు జరిగేటప్పుడు ఈ స్తంభాలకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయటం పరిపాటిగా మారింది. ఫ్లెక్సీల ఏర్పాట్లే కాకుండా వీటిని అనుకుని పెద్ద పెద్ద కటౌట్‌లు కూడా పెట్టేవారు. ఇలా ప్రతి సారీ ఎవరో ఒకరు పెట్టడం.. మున్సిపాలిటీ అధికారులు తొలగించటం జరిగేది. వీటిని ఆపేలా చర్యలు తీసుకునేందుకు మున్సిపాలిటీ కౌన్సిల్ ఒక తీర్మానం చేసింది. వీధిలైట్ల విద్యుత్ స్తంభాలకు ఎటువంటి ఫ్లెక్సీలు గానీ, కటౌట్‌లు గానీ ఏర్పాటు చేయకుండా ఉండేందుకు స్తంభాలకు ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అటు ఫ్లెక్సీలు పెట్టకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు పట్టణం రాత్రి వేళల్లో సుందరంగా ఉంటుందని తలచి లక్షలు వెచ్చించి అన్ని స్తంభాలకు ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. ఎల్ఈడీ లైట్లు వేసేముందు వాటికి ఉన్న ఫ్లెక్సీలన్నింటినీ తొలగించారు.

తాజాగా పునర్ దర్శనం

ఇదిలా ఉండగా జనవరిలో సంక్రాంతి పండగ నాటి నుంచి వీధి లైట్ల స్తంభాలకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయటంతో ఎక్కడా ఫ్లెక్సీలు ఏర్పాటు కాలేదు. తాజాగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నేతృత్వంలో ఈనెల 13న జాబ్ మేళాను వీఎస్ఎం కళాశాలలో నిర్వహిస్తున్నారు. మంత్రి సుభాష్ తండ్రి సత్యం ఈ కళాశాలకు చైర్మన్. దీంతో జాబ్‌మేళాకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆదివారం పట్టణంలో గల ప్రధాన రహదారిలోని వీధిలైట్ల స్తంభాలకు మొత్తం తగిలించారు. ఇప్పటివరకు ఎంతో అందంగా కనిపించే వీధిలైట్ల స్తంభాలు ఇప్పుడు ఫ్లెక్సీలతో నిండిపోయాయి. పాత సంప్రదాయమైన ఫ్లెక్సీల ఏర్పాటు సంస్కృతికి తిరిగి మొదలు పెడుతున్నట్లు అయ్యిందని పట్టణ వాసులు అంటున్నారు. ఇదిలా ఉండగా రాత్రి వేళల్లో ఎంతో సుందరంగా ఉండే ఎల్ఈడీ లైట్లు మీదనే ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయటం వల్ల లైట్ల కాంతి కనిపించే అవకాశం ఉండదు. వీటిని చూసి మరలా ఏ కార్యక్రమం జరిగినా ప్రతి ఒక్కరూ ఇలాగే ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే అవకాశం ఉందనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న వీరు మార్గదర్శకులుగా ఉండాల్సింది పోయి ఇలా చేయడమేమిటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

నేత్రానందంగా నగరోత్సవం



ద్రాక్షారామ వీధుల్లో పల్లకీలపై కల్యాణమూర్తుల నగరోత్సవం



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా పేరుగాంచిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ఉదయం పల్లకీలపై కల్యాణ మూర్తుల నగరోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి గరుడ వాహనంపై నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు, భక్తులు కల్యాణ మూర్తుల వెంట పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని నేతృత్వంలో రెండో రోజు ఆదివారం కల్యాణ వేదికపై హైదరాబాద్‌కు చెందిన నృత్యమాల అకాడమీ విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా అలరించింది. కళాకారుల నృత్య భంగిమలు, నటనా కౌశలం ఆకట్టుకున్నాయి.

వైజ్ఞానిక ప్రదర్శనలతో శాస్త్రీయ దృక్పథం వృద్ధి



విజేతలైన విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు

రామచంద్రపురం: శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగ పడతాయని రేవతి సైన్స్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ కవిత పేర్కొన్నారు. అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఆమె అధ్యక్షత వహించారు. ప్రదర్శనను ఏజీపీ పద్మ కమల కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చట్టాల పట్ల అవగాహన పెంచుకొని సామాజిక చైతన్యాన్ని పొందాలన్నారు. కార్యక్రమ ప్రారంభ సమయంలో రాజీవ్ మున్సిపల్ యూపీ స్కూల్, పెద్దాపురం విద్యార్థులు ప్రదర్శించిన అభినయ గీతం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు 150 ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. ప్రముఖులు డాక్టర్ సీ.రామారావు, జీవీ రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ జీఎస్ సుబ్రహ్మణ్యం, జి.వసంత కుమార్, పి.వి.బ్రహ్మానందం, డాక్టర్ రవికుమార్, కె.వి.వి సత్యనారాయణ, రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ సాయి, బుద్ధా శ్రీనివాస్ తదితరులు విజేతలైన విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

నులి పురుగులను నులిమేద్దాం

- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 17 పీహెచ్‌సీల పరిధిలో పంపిణీ
- రెండు నియోజకవర్గాల్లో 48,351 మందికి అందించేందుకు కార్యాచరణ
- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం



అంగర పీహెచ్‌సీలో పంపిణీకి సిద్ధం చేసిన ఆల్బెండజోల్ మాత్రలు

కపిలేశ్వరపురం: తిన్న ఆహారం వంట పట్టాలంటే శరీరంలో జీవ క్రియలు సక్రమంగా జరగాలి. అందుకోసం పొట్ట ఆరోగ్యంగా ఉండాలి. చల్లని కడుపులో నులి పురుగులు ఏర్పడి చిన్నారుల ఆరోగ్యాన్ని చిదిమేస్తుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ఏటా నిర్వహిస్తుంటాయి. అందులో భాగంగా 19 ఏళ్ల లోపు బాల, బాలికలే లక్ష్యంగా సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే మాత్రలు పీహెచ్‌సీలకు చేరుకున్నాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని చిన్నారుల్లో రక్త హీనత నివారణే లక్ష్యంగా సాగుతున్న కార్యక్రమంపై కథనం...

కార్యాచరణ ఇలా..

మాత్రల పంపిణీ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖతో పాటు విద్యా శాఖ, మాతాశిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్‌లు సమన్వయంతో కృషి చేస్తున్నాయి. రెండు నియోజకవర్గాల్లోని 17 పీహెచ్‌సీల పరిధిలో 795 సంస్థల్లో 48,351 మంది చిన్నారులకు మాత్రలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. రామచంద్రపురం పట్టణంలోని రెండు అర్బన్ పీహెచ్‌సీలు, రూరల్ మండలంలోని వెల్ల, ద్రాక్షారామ, కె.గంగవరం మండలంలోని పామర్రు, పేకేరు, దంగేరు, కుందూరు, శేరిలంక, మండపేట పట్టణంలోని రెండు అర్బన్ పీహెచ్‌సీలు, మండపేట రూరల్ మండలంలో డి.కేశవరం, ద్వారపూడి, కపిలేశ్వరపురం మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం, రాయవరం మండలంలోని రాయవరం, మాచవరం పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది మాత్రల పంపిణీ కార్యక్రమంలో శ్రమించనున్నారు. 904 మంది ఆశా, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొననున్నారు. వారిలో 135 మంది ఏఎన్ఎంలు, 337 మంది ఆశా కార్యకర్తలు, 432 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

రామచంద్రపురం డివిజన్‌లో మాత్రల పంపిణీ ఇలా..

మండలం	విద్యా సంస్థలు	విద్యార్థులు	అంగన్వాడీ కేంద్రాలు	చిన్నారులు
ఆర్సీపురం పట్టణం	27	4,814	18	730
ఆర్సీపురం రూరల్	82	6,056	38	1,171
కె.గంగవరం	84	3,967	78	982
మండపేట	27	4,497	16	608
మండపేట రూరల్	71	8,118	78	3,597
రాయవరం	61	7,085	70	2,651
కపిలేశ్వరపురం	67	3,415	78	660
మొత్తం	419	37,952	376	10,399

సమన్వయంతో పూర్తి చేస్తాం



ఆల్బెండజోల్ మాత్రను ఎలా వేసుకోవాలన్న అంశాన్ని చిన్నారులకు అవగాహన కల్పించాం. పీహెచ్‌సీల సిబ్బంది విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మాత్రలను పీహెచ్‌సీలకు తరలించాం. సిబ్బందికి సూచనలు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

డాక్టర్ ఎస్.ప్రశాంతి, సబ్ డివిజనల్ అధికారి, రామచంద్రపురం.

అవగాహన అవసరం

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రను అవగాహనతో మింగాలి. రెండేళ్ల లోపు చిన్నారులు సగం మాత్రను నీటిలో కరగబెట్టి మింగాలి. మిగిలిన వారు పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్రను పరగడుపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశాలున్నందున ఆహారం తీసుకున్న తర్వాతనే మింగాలి.

అదే జోరు.. అదే సందడి

- తీర్థానికి తరలివచ్చిన భక్తులు
- ఆహ్లాదం అందిస్తున్న రంగులరాట్నం



వినోద సాధనాల వద్ద భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాల్లో ఆరో రోజు ఆదివారం కూడా భక్తుల రద్దీ యథావిధిగా ఉంది. సెలవురోజు కావడంతో స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో అంతర్వేది పురవీధులు కళకళలాడాయి. మాఘమాసంలో సముద్ర స్నానాలకు విశిష్టత ఉండడంతో భక్తులతో బీచ్ కిటకిటలాడింది. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామిని క్యూలో వెళ్లి దర్శించుకున్నారు. లక్ష్మీనృసింహునితో పాటు, క్షేత్రపాలకుడైన నీలకంఠేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, గుర్రాలక్క, వశిష్టాసేవాశ్రమాల వద్ద భక్తుల సందడి నెలకొంది.

గ్రామోత్సవాలు

అంతర్వేది ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం గజ వాహనంపైన, రాత్రి పొన్న వాహనంపైన స్వామివారి గ్రామోత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. గజం బుద్ధికి సంకేతం. భక్తుడు బాగా ఆలోచించి, భక్తి, జ్ఞాన, వైరాగ్యాల వైపు భక్తులను నడిపించేందుకు స్వామి గజ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సర్వస్వం నీవే అన్న గోపికల ఆత్మనివేదనను స్వీకరించినట్టుగా భక్తుల ఆత్మ నివేదనను స్వీకరించేందుకే పొన్న వాహనంపై స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

పాలమూరు సత్రం ఆధ్వర్యంలో..

రాత్రి 7 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా పాలమూరు సత్రం నిర్వాహకులతో స్వామికి అన్నపర్వత మహానివేదన వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో అర్చకస్వాములు సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని చేశారు. దీని నిమిత్తం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ దర్శనాలు నిలిపి, శ్రీస్వామివారి సన్నిధి శుద్ధి చేసి శాస్త్రోక్తంగా స్వామికి అన్నపర్వత మహానివేదన చేశారు. అన్నపర్వత మహానివేదన అనంతరం యథావిధిగా భక్తులకు స్వామివారి దర్శనాన్ని దేవస్థానం కల్పించింది.

నోరూరించే జీళ్లు, ఆహ్లాదాన్ని పంచే రంగుల రాట్నాలు

తీర్థంలో దుకాణదారులు సిద్ధం చేస్తున్న జీళ్లు భక్తులకు నోరూరిస్తున్నాయి. అలాగే ఖర్జూరం కూడా భక్తులు కొనుగోలు చేసుకుంటున్నారు. భక్తితో పాటు ఆహ్లాదాన్ని అందించే జెయింట్ వీల్స్, రంగుల రాట్నం, ఉయ్యాల పడవ వద్ద పిల్లాపాపలతో తల్లిదండ్రులు సంతోషంగా గడిపారు.

మాజీ మంత్రి విశ్వరూప్‌ను కలిసిన సూర్యప్రకాశ్



మాజీ మంత్రి విశ్వరూప్‌తో సూర్యప్రకాశ్

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ను రామచంద్రపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాశ్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా విశ్వరూప్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనను యువజన విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమించిన పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా సమన్వయకర్త బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, పార్టీ వ్యవహారాల సమన్వయ కర్త సజ్జల రామకృష్ణారెడ్డిలకు సూర్యప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యువతను పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేలా చేయడానికి శాయశక్తులా కృషి చేసి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ఘనంగా ధనలక్ష్మీ అమ్మవారి పెట్టు జాతర



ప్రత్యేక అలంకరణలో ధనలక్ష్మీ అమ్మవారు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు కుందాలమ్మచెరువు కుడుపూడివారి పేట గ్రామంలో వేంచేసి యున్న ధనలక్ష్మీ అమ్మవారి పెట్టు జాతర మహోత్సవాన్ని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించగా ఆదివారం పెట్టు జాతర నిర్వహించి భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారాం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీల్లో గెలుపొందిన టీముకు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ సతీష్‌రావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్ బాదలో జై బీమ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ నెల 14 వరకు టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మాఘ ఆదివారం పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో మాఘ ఆదివారం పూజలు ఘనంగా నిర్వహించారు. మాఘ మాసం పురస్కరించుకుని సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఠం వేద పండితుడు భీమలకొండ వీరావధాని సూర్య భగవానుడికి సౌరహోమం నిర్వహించారు. పీఠం అర్చకుడు ప్రసాద్ సూర్య నమస్కారాలు, పారాయణం, హారతులు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనక దుర్గ, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని క్రాపపాలెంలో హనుమత్ సీతా, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, వశిష్ఠ సపరివార సమేత పట్టాభిరామస్వామి వారి ఆలయ సంపూర్ణ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం జరిపారు. సోమవారం ఉదయం 11.14 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని వారు తెలిపారు.

భగవద్గీత పఠనంతో మనస్సు ప్రశాంతం

అయినవిల్లి: భగవద్గీత పఠనం వల్ల భక్తుల తలరాత మారుతోందని, భక్తుల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరే కృష్ణ మంత్రం జపించిన వారికి అనుక్షణం ప్రశాంత వాతావరణం, సంతోషంగా ఉంటారని, ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.